

# ఛత్రగ్రాహి

డాక్టర్ నేలటూరి వేంకటరమణయ్య

రాత్రి నిశీథము గడచిపోయినది. చుక్కబొడుపు సమయమైనది. కటికి చీకటి. విస్సన వీచు కొండగాలి రొద తప్ప సద్దేమియు లేదు. సర్వము మాటు మణగియుండినది. ఆయవేళ ప్రొద్దున చీకటికి గప్పు వేయుచు నొక వ్యక్తి నిశ్శబ్దముగ గద్వాల రాయచూరుల మధ్య ఘటిగ్రామమున కుత్తరమున దిగియుండు రాయరాణువ పాళెమువైపు నక్కుచు తారుచు వచ్చుచుండెను. శిబిరపు టుత్తరద్వార సమీపమును జేరుసరికి, 'జతనా, ఎవ్వరా వచ్చునది?' అను పహారాసిపాయి హెచ్చరిక వినవచ్చినది. వెంటనె సోదనదివియల వెలుతురు చీకటి గర్భమును జీల్చినది ; ఆ దీప జ్వాలల వెలుగున గాన వచ్చినా డొక జంగముదేవర - వానిని జూడగనే పహారా సిపాయీలకు సందేహము గలిగినది. ఆయ వేళ వా డెచటికి బోవుచున్నాడు ? వేషమును గాంచిన భిక్షాటనకు బోవున ట్లున్నది. అప్పుడు వానికి భిక్షము వేయు వా రెవ్వరు? వాడు శత్రువుల పక్షము సంచారము సేయుచున్న వేగులవాడు గావలయునని నిశ్చయించి మరల 'జతనా' యని హెచ్చరించిరి. దానికి బదులువాడు 'మహాదేవ, మహాదేవ, శివ గురు ధర్మభిక్ష' యని పలికెను. అప్రయత్నముగ కుడిచేయి గంటను వాయింప మొదలిడినది. పహారా జవానులు వాడు వేగుల వాడని నిశ్చయించి వానిపైబడి పెడ రెక్కలు విఱిచికట్టి ద్వారములోపల మొగాళముననుండు చిన్న గుడారములోనికి నీడ్చుకొనిపోయిరి. మంచము పై తివాసిమీద గూర్చుండియుండినాడు వారి నాయకుడు రామలింగ నాయకుడు. జంగము దేవరను జూడగనే గర్జించినాడు రామలింగ నాయుడు, 'ఎవరు నీవు' అని.

'ఆప్తుడను' అని జవాబు చెప్పినాడు జంగముదేవర.

'ఆప్తుడవా ?'

'ఆఁ'

'సంకేతము ?'

'కుంబరిగ'

'ప్రతి సంకేతము ?'

'గోదావరి'

'ఆప్తుఁడా, నీ పేరేమి ?'

'నా పేరు సర్వశిరఃప్రధాని తిమ్మరసయ్యగా రెఱుగుదురు.'

'నీ పేరడిగినాను గాని నీ పే రెవరెఱుగుదురని కాదు'

'నా పేరా ?'

'ఆఁ, నీ పేరే.'

'శివయ్య.'

'ఏ శివయ్య ?'

'దోని శివయ్య.'

'మంచిది. శివయ్యా-సమాచారమేమి?'

'ఉన్నది, అత్యంతావశ్యమైన సమాచారము.'

'మఱి చెప్పరాదా ?'

'సర్వశిరఃప్రధానుల వారి కడకు దోడ్కొని పొండు'

'నాతో చెప్పకూడదా ? సర్వశిరఃప్రధానుల వారిచట లేరు. రాయచూరు దుర్గమునకు బోయిరి.'

'రాయల దేవుడు లేరా ?'

'ఉన్నారు'

'వారి సన్నిధికి బిలుచుకొని పొండు.'

'నాతో చెప్పవా ?'

'ఉత్తరువు లేదు-ఆలస్యము సేయవలదు.'

'రాయల దేవుడు నిద్రించుచున్నారు. ఇచ్చట విశ్రమింపుము-ఉదయమున ఏలికదర్శనము సేయ వచ్చును.'

'జాగుసేయవలదు-విషయ మగత్యమైనది-నాకు వెంటనే రాయలదర్శన మిప్పించకుండిన ఆపద కలుగగలదు.'

'ఎవ్వరికి ఆపద?'

'నీకు నాకు మన కందఱికి.'

'అబ్బ!'

'మఱి నన్ను రాయలదేవుని కడకు దోడ్కొనిపోవా?'

'కానీ, స్వామివారు నిద్రపోవుచున్నారు.'

'నిద్రపోవుచున్న మేలు కొలుపుము.'

'.........'

'నీవిట్లు జాగుచేసిన స్వామివారు ఇక గడియ సేపటిలో——'

అతడింకను మాటను ముగింపలేదు; డేరావాకిటి తెరను దొలగ ద్రోసికొని లోనికివచ్చినాడు రాయలవారి యంగరక్షకుడు; వాని జూడగనే రామలింగనాయడు లేచి నిలిచి యడిగినాడు, 'ఏలినవారి యాజ్ఞయేమి?' అని.

'సర్వశిరఃప్రధానులవారి కొఱ కెవ్వరును రాలేదా?'

'ఎవ్వరును రాలేదు ఈ జంగము దేవరదప్ప -'

అంతట నతడు జంగము దేవరవంక దిరిగి, 'రావయ్యా, నా వెంట. రాయలదేవుడు నీకొఱకు గడియ రెండుగడియలుగ గని పెట్టుకొనియున్నారు' అని పిలిచెను. జంగముదేవరయు నతని వెంట నడచుచు రామలింగనాయని నుద్దేశించి చెప్పినాడు, 'నాయాలస్యమువలన కీడుగలిగిన దానికి నాయనివారు కారణము. వారి చర్యకు రాయలదేవునికి వారు సమాధానము జెప్పుకొనవలసి యున్నది' అని.

* * *

ఆ నిశాసమయమున ఉన్నట్టులుండి మ్రోగినది ప్రయాణభేరి. నిశ్శబ్దముగనుండిన రాయస్కంధావారమున రేగినది కలకలము. ఆదమఱచి నిదురించుచుండిన సైనికులు భేరీనినాదముచే మేల్కొలుపబడి యబ్బురపాటుతో నా ప్రయాణభేరికి కారణము నొండొరులతో విచారింపగడగిరి. ముఖ్య దండనాయకు లిద్దఱుముగ్గురుదప్ప ఆరాత్రి కూచి సేయవలసియుండునని యెవ్వఱునెఱుగరు. సైనికు లిట్లు మలగులాపడుచుండగా పడవాండ్రు వచ్చినారు రాయలదేవుని యాజ్ఞను బ్రకటించుటకు. ఆయుధములను చేబట్టి రణరంగమున యుద్ధము సేయు భటులును, యుద్ధపరికరములను రణభూమియందు వలసినప్పుడు దళములకు సరఫరాసేయు సైన్య పరివారమును, రణవైద్యులును శస్త్రనిపుణులు మొదలగువారు దక్క యన్యులెవ్వఱును సైన్యము వెంటబోరాదని రాయలవారి యాజ్ఞయట! ఏమి చోద్యము! ఎన్నడైన నేదళనాయకుడైన నిట్టి యాజ్ఞనిచ్చి యుండెనా! గాసిపడిన సైనికుల కుపచారము సేయుటకును గాయపడినవారికి గట్లు కట్టి ప్రోదిసేయుటకును, డిల్లపడినవారికి ధైర్యము జెప్పి యాసదాపి యుద్ధమునకు బురికొలుపుటకును విలాసినీజనము గూడ రాకపోయిన యుద్ధము జయప్రదముగ నెట్లు సాగగలదు? రాయలవారి కింత మాత్రము దెలియకపోయెనా? దండనాయకు లేమి చేయుచున్నారు? రాయలవారికి దెలియక పోయిన అనుభవజ్ఞులైన దండనాయకులు తెలుప రాదా? కాని పరివారజనము నంతటిని గదల్చుకొని పోవుటకు వ్యవధిలేదనియు, తురకదండు కోవెలకొండనుండి కృష్ణవైపు తరలివచ్చుచున్నదనియు, గమ్యస్థానమును వారు చేరియుఁజేరక ముందే అకస్మాత్తుగ వారిపైబడి నిర్మూలముగావించుట రాయలవారి యుద్దేశమగుటచే వాయువేగ మనోవేగమున కూచిసేయుటకొఱకే వారట్టియాజ్ఞనిచ్చిరనియు కొందఱు మర్మజ్ఞులు జెప్పదొడగిరి.

సైన్యము గదలినది. సేనాముఖమున గుఱ్ఱపు ఫౌజు మూడుతురుపులు నడచినవి. తరువాత పాయదళము పద లిరువది. పుచ్ఛమున నేనుగుసుట లేబది. గజఘటలమధ్య పుష్పదంతమను సింహళ ద్వీపజమగు పెద్దపోతుటేనుగుపై కృష్ణదేవరాయలవారు కూర్చుండి దళములను వేగిర పెట్టుచు నడపించుచుండిరి. దారియందే యాటంకమును లేక పయనము సాగుచుండినది. చుక్క బొడిచినది. అప్పటికి మూడు నాలుగు పరుగుల దూరము కూచి నడచినది. కృష్ణను జేరుట కింకను రెండుమూడు పరుగులు బోవలసియుండెను. ఛటఛటఛటమని ప్రేలు తుపాకుల మ్రోతయు బాణసంచు పగులు శబ్దములును వినరా నారంభించినవి. తా మింకను తురకదండును దారసిల్లక మునుపే పోట్లాట ప్రారంభమగుటకు సైనికు లచ్చెరువందిరి; కాని రాయలవారు ప్రతిదళనాయకుని యొద్దకు వేగ నడువుడని మాటిమాటికిని పడ

వాళ్ళను దఱుముచు త్వరపెట్ట గడగెను; కృష్ణాతట మింక నరకోసు దూరమున నుండెను. తూర్పున మైల విడిచినది. సూర్యోదయకాల మాసన్నమగుచుండెను. హఠాత్తుగ ప్రజ్వరిల్లినది మిన్నుముట్టెడి యగ్ని జ్వాలయొక్కటి. కృష్ణాతీరమున తురకలేదో గ్రామమును పరశురామప్రీతి గావించిరని యందఱును నిశ్చయించుకొనిరి.

నగార మ్రోగినది. మంత్రబద్ధమైనట్లు సైన్యమాగినది. రాయలవారు వ్యూహరచనావిధానమును దండనాయకులకు దెలియజేయుటకు పడవాళ్ళను దఱుముచుండిరి. అర్ధచంద్ర వ్యూహము. చంద్రవంక మధ్య రాయలవారి యాధిపత్యము క్రింద గజఘటలు. గజముల కిరుపార్శ్వముల రెండు పాయలుగ విభజింపబడిన పాయదళము. కుడివంక పాయకు నాయకుడు గని తిమ్మానాయడు; ఎడమ పాయకధిపతి పెమ్మసాని రామలింగనాయకుడు. పాయదళమున కిరుపక్షముల గుఱ్ఱపుఫౌజు చంద్రవంక రెండుకొమ్ములుగ నేర్పడవలయునని తెలియపఱచిరి. రాయలవారి యా దేశము చొప్పున సేనాధిపతులు వ్యూహమును బన్నుచుండిరి. ఇంతట నెరగులు కొనుచుండు ప్రదేశమునుండి జోదన నేయుచు రాయసైన్యమును వచ్చి చేరినాడొక సవారు. రాయల ఏనుగు చెంత నిలిచి ఉచ్చైస్స్వరముతో విన్నవించినాడు: 'దేవ, అవధారు. ఏలినవారి యాజ్ఞప్రకారము మనమా యాస్కంధావారమును తురకదండును జేరనీయక సంరక్షించుచున్నారము. వారి బలమంతయు నుత్తరపు వాకిలి పైబడినది. తురక గుఱ్ఱపుఫౌజు నాపుటకు సాధ్యము గాకున్నది. ఏలినవారి యాజ్ఞప్రకారము స్కంధావారము తూరుపువాకిలి తూరుపు మైల విడువగనే నిప్పంటించితిమి. పదుగురి కొక్కడే యడ్డునిలిచి పోరుచున్నాడు గొడుగు వెంకన్నగారు-ఇంక నెంతసేపు తురకలను నిలుపవలయునని ఏలినవారి యాజ్ఞయో తెలిసికొని రమ్మని నన్ను పంపినారు.'

కృష్ణరాయల ముఖము మందహాసముతో వికసించినది. 'మజ్జారె, వెంకన్న, శూరుడవోయి!' అను ప్రశంసావాక్యము లప్రయత్నముగ వెలువడినవి రాయదేవుని దివ్యవాక్కునుండి.

'హసాదు, దేవా ధన్యుడను' అను మాటలు విన వచ్చినవి చౌడోలు వెనుకప్రక్కనుండి-కాని కృష్ణరాయ లా మాటలను చెవిని బెట్టలేదు. ఆశ్వికుని కాజ్ఞాపించినాడు - "సత్వరము గవుడుతీయుము. చెప్పుము వెంకన్నతో మా మాటలను-'ఇంక నచట నిలువరింప నవసరములేదు. నీ శౌర్యమును శక్తిసామర్థ్యములతో నెఱవేర్చినాడవు. తురకలను స్కంధావారములోనికి విడువుము. ఇదె మేము నిన్ను జేరవచ్చుచున్నారము' అని."

ఆమాట చెవులబడగనే యా సవారు గుఱ్ఱమును మరల్చుకొని దౌడాయించినాడు.

* * *

మామా స్కంధావారమును ప్రవేశించినది తురకదండు-యూసుఫ్ ఆదిల్ ఖానుని సేనాధ్యక్షుడు గజ్నఫరీ అలీఖానుడు బిజాపుర గుఱ్ఱముతో నుత్తరద్వారముగుండ స్కంధావారమును ప్రవేశించెను; కాని యడుగడుగునకును విజయనగర గడలఫౌజు వారిని ముందుకు సాగనీయక అడ్డపెట్టుచుండినవి. ఏదుపందిముండ్లవలెనిక్కబొడుచుకొని ఈటెమొనలు గుఱ్ఱములను గాఱించుచు విజయనగరభటుల దాపు సేరనీయక ప్రతిబంధకములైనవి. గడలబారునకు నాయకుడు గొడుగు వెంకన్న మొండి ధైర్యముతో మొండొడ్డి పైపై వచ్చు తురకరౌతులను గుఱ్ఱములపైనుండి త్రెళ్ళద్రోయుచు క్రిందబడినవారి నట్టె పొడుచుచుండెను. అతని శౌర్యమును జూచి యుబ్బి యతని యనుచరులతని ననుకరించుటచేత తురకదళముల నడక పెండ్లి నడకైనది. గజ్నఫరీ అలీఖానునకు కోపమువచ్చినది. అంతదనుక తురకపోటు రుచి యెఱుగని యా క్రొత్త రాయలను అసీరుచేసి తెచ్చెదనని సుల్తానుగారి నిండు దర్బారులో దానాడిన ప్రగల్భవాక్యములు వ్యర్థములై పోవునని భయముగలిగెను. ఒక్కపైద జవాను తనవంటి గడిదేఱిన శూరుని అడుగు ముందు పెట్టనీయక యడ్డగించిన తన పేరుప్రతిష్ఠ లేమి కాగలవు? అని చింతించి సింగాణి రౌతులకు సెలవిచ్చెను. విజయనగర భటులపై శరవర్షము గురియ నారంభించినది. క్రమక్రమముగ వారు వెనుకకు జరుగ మొదలిడిరి. దానిని జూచి తురకరౌతు లుత్సాహముతో ముందున కుఱుక ప్రయత్నించుచున్నను గజ్నఫర్ అలీకి తాను శత్రులొడ్డిన వలయందు దగుల్కొంటినను సందేహము బొడమినది. శత్రు పరిజన భరితముగ నుండవలసిన స్కంధావారము నిశ్శబ్దముగను నిర్మానుష్యముగ

గాన వచ్చుటయు దనకొకచోట నిలిచి జగడము జూపక తిన్నగ ననుక్షణమును లోనికి దన్నెల యించుకొని పోవుచుండు నా శత్రువీరుని ప్రవర్తనయు నతని యనుమానమునకు ముఖ్యకారణములు.

శత్రుమర్మమును సత్వరము గనుగొనుట యుక్తమని నిశ్చయించి, సింగాణి రౌతులకు జేయి వీచి తుపానునందు దగుల్కొనిన పడవపైబడు గచుయలవలె గజ్నఫర్ అలీ యొక్కసూర్మత్తున వెంకన్న పైనుఱికెను. ఆ క్షణముననె వినవచ్చినది యతని పింగలినుండి 'హరహర మహాదేవ'యను విజయనగర సింహనాదము. ఆ సింహనాదము శత్రుగర్భ నిర్భేదకమైనను వెంకన్నకు మృత్యుప్రాయమైనది. తన కార్యము జయప్రదముగ నెఱవేరె గదా యని జాగరూకత నొక క్షణము మఱచి వెనుదిరిగినాడు. వచ్చి గాడినది సింగాణి కోల హృదయమున. గ్రుక్కుమిక్కనక నేలవ్రాలి రణశయ్య నలంకరించెను.

వెంకన్న స్వర్గారోహణమును కృష్ణరాయలు కన్నుల గాంచెను. రాయలవెనుక శ్వేతచ్ఛత్రమును చేబట్టి నిలిచి యుండిన వెంకన్నతండ్రి గొడుగు ప్రోలయ్యయు గనుగొనెను. ఏకపుత్రుడు విద్యానిధి. కుమారుడు ప్రాణప్రియుడు వెంకన్న. అతని మరణము ప్రోలయ గుండెను చీల్చినది; వెంకన్నతో గూడ ప్రోలయ ప్రాణము స్వర్గసీమ కెగసినది. ప్రోలయ చౌడోలునందు రాయలవెనుక మలచిపెట్టిన ఱాతివిగ్రహమువలె నిశ్చలుడై నిలిచియుండెను; కదలలేదు; కంట దడి పెట్టలేదు; ఊర్పు లేదు; చైతన్యచిహ్నములే కానరాలేదు. దుఃఖముచే స్తబ్ధుడై శిలాసదృశుడై పోయినాడు; కాని యతని పాతమును



బోలి పైకొని వచ్చుచుండిన విపత్తొక్కటి యతని స్తంభనమును క్షణమాత్రము దొలగించి చైతన్య స్ఫూర్తి గలిగించినది. నిర్జీవప్రతిమవలె నున్నవా డుగ్రమూర్తియై వెలుగొందినాడు. ఈ మార్పునకు గారకుడు గజ్నఫర్ అలీఖానుడు. రాయలు సైన్యముతో బ్రత్యక్షమైనంత

టనే యతడు శత్రువుల మోసమును గ్రహించినాడు. తమ్ము భ్రమపెట్టి వంచించుటకొఱకు దాముపచ్చు మార్గమున నొక కైతవస్కంధావారము శత్రులు నిర్మించినారు. అది రాయల వాస్తవశిబిరముగాదు; తమ్మేమరయించుటకై తయారుచేసిన దీమం. వంచన నెఱుగక తాము రాయశిబిరమును లూటిచేయ బోవుచుంటిమని యుప్పొంగుచుండగా మాటునదాగియుండు వేటకానివలె సమయము వేచియుండి రాయలు మార్కొన్నాడు. బలే! రాయల లష్కరీతనము మెచ్చదగినదే. తాము అడకొత్తులోని పోకవలె శత్రువుమధ్య జిక్కికొనిరి. తమకు రణమరణమో శత్రువులచే బందీకరణమో ధ్రువమని తెలిసికొన్నాడు; కాని గజ్నఫర్ అలీ ధైర్యమును గోలుపోలేదు. శత్రువులకు దన ప్రాణమును నయముగ సమ్మదలపెట్టలేదు; సాహసమున కతడు పెట్టినది పేరు; తనకు రణమరణము దప్పనియెడల దన పేరును మహమ్మదీయ ప్రపంచము నందంతటను మారుమ్రోగింపజాలిన యసాధారణ సాహస కృత్యమును నెఱవేర్చి యసువుల నల్లా కొప్పజెప్పవలయునని నిశ్చయించుకొనెను. వెంకన్న చావువలన ధైర్యముచెడి విజయనగరగడలఫౌజు విఱిగి నిలుగడల చెదరినది. రాయదళములందు కొంత కళవళము గలిగినది. అది కందుచేసికొని గజ్నఫర్ అలీ తన గుఱ్ఱమును ముందునకు నూకినాడు. అతని యుద్దేశమిట్టిదని ఇతరు లూహించుటకు ముందె గుఱ్ఱముపైనుండి లంఘించినాడు. రాయలెక్కియుండు పుష్పదంతగజము తొండమును బట్టికొని బిరబిర పైకెగబ్రాకిపోయి రెండుదంతములపై గాళ్లూని నిలిచి యొఱలోనిఖడ్గమునుదూసి యొక్కవ్రేటున మావటిని దెగనఱికి క్రిందద్రోసి కుంభస్థలముపై నెక్కి నిలిచినాడు. ఎడమ చేత చౌడోలుచట్టమును బట్టుకొని రాయల శిరమును వ్రేయ కుడి చేత ఖడ్గమును పైకెత్తినాడు. క్షణములోపల కత్తిరాయలపై వాలునట్లుండెను. రాయలవారుగాక మఱియార్గురుశూరు లాచౌడోలునందుండిరి. హఠాత్తుగ ప్రత్యక్ష మృత్యుదేవతవలె బొడసూపిన గజ్నఫర్ అలీని జూడగనే వారు దిగ్భ్రమజెందిరి. బీరమునకు వీడ్కోలిచ్చి యాత్మసంరక్షణయె పరమావధిగనెంచి వారార్గురును క్రిందికి దూకిరి. రాయలదేవుడప్పుడేమి దలచెనో చెప్పుటకు సాధ్యముగాదు; అతని శిరముపై విద్యుల్లతవలె గజ్నఫర్ అలీఖడ్గము వ్రాలుచుండినది. ఇక తెప్పపాటు కాలమున నతని చరిత్ర సమాప్తియగునట్లు తోచినది—ఈ ఘోరదృశ్యము దుఃఖముచే సొమ్మసిల్లియుండిన ప్రోలయ యాత్మకు చైతన్యము గలిగించినది. రాయలవిపత్తును గ్రహించినాడు. కుడిచేతనుండినది నేజా-చేయి వెనుకకెత్తి సత్తువ కొలదియు గుమ్మినాడు గజ్నఫర్ అలీ బొమ్మమీద- నిశ్చలుడై యుండిన గొడుగుమోపరివలన నెట్టి యపాయముగలుగునని శంకింపకుండుటచే గజ్నఫర్ అలీ తప్పించుకొనుటకే ప్రయత్నము సేయలేదు. అశనిఘాతవలె దాకిన నేజాయురువడికి నిలువరింపజాలక కుంభస్థలమున నుండి క్రిందికి దొర్లెను. ప్రోలయ మొదలుపెట్టిన కార్యమును ముగింప దలకొన్నట్లు పుష్పదంతము క్రిందబడిన గజ్నఫర్ అలీ శరీరమును తొండముచే గబళించి మీదికెత్తి నేలజఱచి యతని బొమ్మపై గాలిడి చిదగద్రొక్కెను. తక్షణమే మ్రోగినది జయభేరి—మావటివాడులేని యేనుగునుండి రాయలవారు క్రిందికి దూకిరి. ప్రోలయయు చక్రవర్తి ననుసరించి దిగెను.

గజ్నఫర్ అలీ మరణమందినను యుద్ధమాగలేదు. అతనిక్రింది సర్దారుడు నాయకత్వమువహించి తురకరౌతులను గయ్యమునకు బురికొల్పెను. కానివారు మునుపటివలె గుండెదిటవుగలిగి పోరలేదు. అప్పటికి రాయసైన్యమా కైతవస్కంధావారమును జుట్టుకొనెను. క్రమ క్రమముగ నర్ధచంద్రుని శృంగములు రెండును నిడుదలై యుండొంటిని సమీపింప గలిగినవి. తురకరౌతులట మీద పోరుట వ్యర్థమని యెఱిగి యాయుధములను దిగవిడిచి తలపాగల నూడ్చి మెడలచుట్టు దండలుగవేసికొని శరణు వేడిరి- రాయలవారియాజ్ఞ చొప్పున రణవాద్యాధ్యక్షుడు ధర్మదారను బట్టెను.

యుద్ధకార్యము ముగిసినది. నిజసైనికుల స్థితిగతుల స్వయముగ బరిశీలించి కనుగొనుటకు కృష్ణదేవ మహారాయలవారొక్కపర్యాయము జనము జుట్టి చూచిరి. విశేషము నష్టముగాలేదు-దాదాపు రెండువేలమంది మడిసిరి. వారియందు జాల భాగము గడలవారే. వెంకన్న యొక్కడుదక్క పేరునాయకు డెవ్వడును ప్రాణముల గోల్పోలేదు. రక్తసిక్తమైన యతని దేహమును జూడగనే

రాయలవారికి జాలి గలిగినది. పసివాడు - ఇంకను జక్కాగా నిఱువదియేండ్లు దాటలేదు. కాని ఎట్టి పరాక్రమశాలి! పెద్దవాడగునంతవఱకు దేవుడు కన్నులు మూసికొనియుండిన సమకాలిక దళనాయకులలో నగ్రస్థానమును వహింపదగినవాడు. అంతటి చిన్నతనముననె స్వర్గకాంత లతని నాచికొనిపోవుట శోచనీయము. అని చింతించి యతని యంత్య సంస్కారము సేయుటకును నతని కీర్తిని ప్రకటించు వీరశిలను నిలుపుటకు దగునేర్పాటులను గావించెను; గాయపడినవారిని గని వారి శౌర్యమును బ్రశంసించి, వారిని కట్లుకట్టి చికిత్స సేయుటకు వ్రణవైద్యుల కడ కంపెను. వారి నందఱిని రణభూమినుండి స్కంధావారపు టారోగ్యశాలకు గొనిపోవువఱకును నచట నేయుండి యటు పిమ్మట దన విడిదలకు జేరెను.

మధ్యాహ్నమైనది-మజ్జన భోజనాదుల కవసరమని వేత్రహస్తులు విన్నవించిరి. మజ్జన భోజనాదులైన పిమ్మట రాయలవా రభ్యంతర గుడారమున నించుక విశ్రమించిరి. సాయంసమయమున వెలిగుడారమున గొలువు దీరిరి. యథాప్రకారము రాజ చిహ్నధారులైన యూడిగమువారు రాయపీఠమును బొదివి నిలిచియుండిరి. ప్రోలయ వారియందు గానరాలేదు. అతనిస్థానమున యువకు డొక్కడు శ్వేతచ్ఛత్రమును బట్టుకొనియుండెను. రాయలవా రామార్పును గమనించినట్లు లేదు. పీఠముపై నాసీనుడైన వెంటనే రాయసమువారు తెచ్చి సముఖమున నుంచిన జయలేఖల ముదల (డ్రాఫ్ట్) లందు నూతనాంశములను జేర్చి యొప్పములులిఖించి యేయేరాజులకు, సామంతులకు నాయకులకు,దుర్గాధిపతులకు వానిని బంపవలయునో తెలియజేసెను. రాయలవారి విజయమును విని తమ యభినందనమును దెలుపుటకు సమీపస్థులగు మన్నె దొరల మంత్రులతో నుచితరీతిని సంభాషించి వారి యంతస్తులకు దగిన రీతిని సత్కరించెను. అవసరముల వా రడుగడునకు బ్రవేశించి రాయదర్శనార్థము వచ్చిన వారి కవసరము కలదేమో విచారించుచుండిరి. నిండోలగమున కొలువు దీరి కార్యనిమగ్నుడై యుండినను మాటిమాటికిని రాయదేవుని దృష్టి ద్వారము వైపు పాఱుచుండినది. రెండు గడియల కాలము గడచిపోయినది. కొలువు లేచు సమయమైనది.ప్రవేశించినాడు కట్టియమువాడు. 'అవధారు మహారాయా, ఆదెప్ప దండనాయకుని శిబిరమునుండి హరకారవచ్చి హజారమున నిలిచియున్నాడు. ఏలినవారి యాజ్ఞయైన దోడ్కొని వచ్చెదను' అని నివేదించెను. 'తక్షణము బ్రవేశపెట్టుము' అని రాయలదేవు డాజ్ఞాపించెను. 'చిత్తైసు, దేవా' యని కట్టికమువాడు ద్వారమునకుబోయి హరకారతో మరలి వచ్చెను. హరకారా రాయలవారి పీఠము ముందు సాష్టాంగపడి లేచి చెప్పదొడగినాడు, "రాజాధిరాజ రాజపరమేశ్వరా, పరాకు. రాయలదేవుని యానతి చొప్పున సర్వశిరః ప్రధాన తిమ్మరసయ్యగారి ముదలను ఆదెప్పదండనాయకులవారు త్రియంబకరావు రాచిరాజు తిమ్మయ మట్లి వరదరాజు నంద్యాల నారపరాజు అవుకు తిమ్మరాజు మొదలగు దొరలతోగూడ రాత్రికి రాతిరే కూచి చేసివచ్చి కృష్ణ కవ్వలియొడ్డున విడిసి యుండిన బెడదకోట దండుపైబడి నఱికి నిర్మూలముగావించినారు. హతశేషులు యథాయథలై పాఱిపోయినారు. తురకల శిబిరమును వస్తుసామగ్రి సర్వమును స్వాధీనమైనది. ఏలినవారి యాజ్ఞకొఱకు వేచియున్నారు" అని.

కృష్ణరాయల కీసందేశ మపరిమితానందము గలిగించినది. ఇది తురకలపై రాయలవారి తొలి విజయము. వారి నంతటితో వదలిపెట్టి వెనుదిరుగుట కాయన కిష్టములేదు, కావున హరకారాను జూచి యాజ్ఞాపించినాడు: 'తడవుసేయక సైన్యముతోగూడ పాఱిపోవుచుండు తురకలను వెంబడింపుమని మాయాజ్ఞ. రేపు సర్వదళములతో మేము వచ్చి కలసికొనియెదము' అని. హరకారా వెంటనే బయలు వెడలి పోయినాడు.

రాయలవారు ఆనతిచ్చినారు: 'మన జైత్రయాత్ర శుభ ముహూర్తమున ప్రారంభమైనది. రెండుజయము లేకకాలమున జేకూడినవి. శూరరత్నము నొక్కని గోలుపోతిమి. ప్రాణాపాయము క్షైపికముగ దొలగిపోయినది. ఒరగల్లు ఇత్తడి బంగారముల భేదమును దెలియబఱచినట్లు శూరమానులకును వీరులకును గల వ్యత్యాసమందువలన విశదపడినది. ఆయుధోపజీవుల కివి సామాన్యమైన యనుభవములు. రేపటి యుషఃకాలమున బెడదకోటపై గూచిసేయవలసియున్నది. నాయకులు దొరలు మున్నగువారు తమతమ

మందితో బయణమునకు సిద్ధపడవలయును. మన కిది జయకాలము. శుభశకునము లెన్నియేనియు గానవచ్చుచున్నవి.'

రాయలవారంతట కొలువుచాలించి శిబిరాభ్యంతరమంటపమునకు పోయిరి. దండనాథ సామంతమాండలికాది సేనాప్రముఖు లెవ్వరెవ్వరి విడిదలకు వారు తరలిరి.

(ఇంకా వుంది)

# టెక్నోక్రసీ

సామిధేని సావిత్రీదేవి

తినడానికి తిండీ, కట్టడానికి బట్టా, ఉండడానికి ఇల్లూ - ఈ మూడూ మానవునికి ప్రాథమిక అవసరాలు. మన దేశంలాంటి దేశాలలో అధికసంఖ్యాకులకు ఇవికూడా అవసరమైనంతగా దొరకటం లేదని అందరికీ తెలుసు. ఈ సమస్యని పరిష్కరించడానికి 'టెక్నోక్రసీ' ఒక మార్గం. దేశంలో ప్రజల కందరికీ సరిపోయేటట్లుగా ప్రాథమికావసరాలను ఉత్పత్తి చెయ్యడం; ఉత్పత్తి అయిన పదార్థాలను అందరికీ అందుబాటులో ఉండే ధరలకు సరఫరా చెయ్యడం; తద్వారా ప్రజల జీవితాన్ని సౌఖ్యవంతంగా చెయ్యడం- దీనికి 'టెక్నోక్రసీ' అని పేరు.

ఇది ఎలా సాధ్యం అవుతుంది? ప్రస్తుతం ఉత్పత్తి కేవలం లాభం కోసం జరుగుతోంది ఏ వస్తువు ఉత్పత్తి సామాజిక దృష్ట్యా అవసరం అనే ప్రశ్నతో ఉత్పత్తి దారునికి నిమిత్తంలేదు. ఏ వస్తువును ఉత్పత్తి చెయ్యటంవల్ల ఎక్కువ లాభాన్ని సంపాదించవచ్చును? అనేదే అతని సమస్య. దీనివల్ల కలిగే ఫలితం ఒక్కొక్కప్పుడు అమానుషంగా పరిణమించవచ్చు. దేశంలో ఆహారం చాలా అవసరం అయి ఉండవచ్చు; ప్రజలు తిండిలేక మలమలమాడుతూ ఉండవచ్చు; కాని ఆహారపదార్థాల ఉత్పత్తికంటె మోటారు కార్ల ఉత్పత్తివల్ల ఎక్కువ లాభం సంపాదించడానికి అవకాశం ఉంటే ఉత్పత్తిదారుడు మోటారుకార్లనే తయారుచేస్తాడు. ఇది సమాజంలోని వ్యక్తులకు సంపూర్ణంగా తమ ఇష్టంవచ్చిన వ్యాపారంలో పాల్గొనడానికి స్వాతంత్ర్యం ఉన్నపుడే సాధ్యమవుతుంది. ఈ స్వతంత్ర వ్యాపార పద్ధతి దేశానికి అరిష్టమనీ, దేశంలో ఉత్పత్తి ప్రణాళికాబద్ధం అయి ఉండాలనీ నేడు అన్ని దేశాల ప్రజలూ, ప్రభుత్వాలూ గుర్తించాయి. ఏ ఏ పదార్థాల ఉత్పత్తి ముందుగా జరగాలి? అనే విషయం ప్రభుత్వం నిర్ణయించి ఆ ప్రకారం ఉత్పత్తిచేసే వస్తువులలో పూర్వాపరాలను నిర్ణయించాలనే విషయం ప్రతి ఆర్థిక వేత్తా, ప్రతి రాజకీయవాదీ అంగీకరిస్తున్నాడు.

ఇది నిజం అయితే, ప్రాథమిక అవసరాలను తీర్చే తిండీ, బట్టా, ఇల్లూ - వీటి ఉత్పత్తి ముందుగా జరగాలి. మనదేశంలో ఆహార పదార్థాలను ఎక్కువగా పండించమని ప్రభుత్వం చేస్తూన్న హెచ్చరిక జయప్రదం కాలేదు; ఉత్పత్తిని హెచ్చించడానికి అవసరమైతే ప్రభుత్వం స్వంతంగా పరిపాలన శాఖల ద్వారా ఉత్పత్తికి పూనుకోవాలి; వ్యవసాయంలో సరి క్రొత్త పద్ధతులను ప్రవేశపెట్టాలి; స్టేండర్డ్ బట్టలను ఉత్పత్తి చెయ్యడానికి ప్రభుత్వం యుద్ధకాలంలో ప్రారంభించిన ఉద్యమం తిరిగి పునరుద్ధరించాలి; ఈ విషయంలో ఏలాటి ఒత్తిడికి ప్రభుత్వము లొంగకూడదు. ఇళ్ళ విషయంలో కావలసినంతగా సిమెంటూ, ఇనుమూ దొరకటంలేదు. కాని తాటాకుల ఇళ్లు కట్టడానికీ, కట్టుకోడానికి అవకాశాలు కల్పించడానికీ అభ్యంతరం ఏమిటి? ఈ విధంగా ఆహారం, వస్త్రం, వసతి అందరికీ దొరికేటట్లు చూడడం ప్రభుత్వ కర్తవ్యం.

ప్రాథమికావసరాలను సరి క్రొత్త యంత్రాల సహాయంతో విరివిగా ఉత్పత్తి చెయ్యాలి. సరికొత్త పద్ధతులను ప్రవేశ పెట్టడంవల్ల నిరుద్యోగం ప్రబలుతుందనీ, అది దేశానికి నష్టం కలుగచేస్తుందనీ అనుకోడం వెర్రిభ్రమ. దేశంలో అందరికీ ప్రాథమికావసరాలు తీరినతరవాత మిగిలిన ఆర్థిక సమస్యా పరిష్కారానికి పూనుకోవచ్చు. ఈ బాధ్యతను ప్రభుత్వం నిర్వర్తించాలి. శాస్త్ర విజ్ఞానం విశేషంగా అభివృద్ధి పొందటంవల్ల ఉత్పత్తికి అన్నివిధాలా అవకాశంగల ఈ కాలములో ప్రతి పౌరునికీ ప్రభుత్వమునుండి తన కనీస అవసరాలను కోరే హక్కు ఉన్నది.